

# శ్రీవారితో సినిమాకు

కొండముది
హనుమంతరావు

ఇవ్వాళ్టిమాట కాదు; పదేళ్ళనాటి మాట.

అప్పటికింకా రాజు కూడా పుట్టలేదు. ఆరోజు జరిగింది జ్ఞప్తికివస్తే ఇప్పటికీ నాకు చక్కిలిగింతలు పెట్టినట్లు నవ్వువస్తుంది.

"ఏమిటి? ఏమిటి?? అలా నవ్వుతున్నావ్...నువ్వొక్కదానివే సంతోషించటమేం? నాక్కూడా చెప్పు. విని నేనూ సంతోషిస్తాను," అంటారు ఆయన.

"అయ్యో. ఏం లేదండి......ఆనాడు సినిమాకు పోలేదూ..."

ఆయన గ్రహిస్తారు. వివర్ణమవుతుంది వారి మొహం. నేను మెళ్ళో వేయబోతున్న నవ్వుల పువ్వులదండను పుటుక్కున తెంపి నా మొహాన కొట్టారు. పరిస్థితి హాస్యానికి విడాకులిచ్చిందని తెల్సుకుని వచ్చే నవ్వు నాపుకుంటాను. ఇహ చూసుకోండి ఆనాడు నా అవస్థ ఆ ఆపద్బాంధవుని కొక్కడికే అవగతం!

"అన్నానికి లేవండి."

మాట్లాడరు. ఇటునుంచి అటు వత్తిగిలి పడుకుంటారు.

"అప్పుడే పదిగంటలవుతున్నదండి."

ఉహూ! అప్పుడేలేస్తే ఇంకా నా అవస్థేముంది!

"అన్నం చల్లారి పోతున్నది. వేడిగా ఉంటేగాని మీరు తినరయ్యెను. ఎలా చచ్చేదండి నేను మీతో?"

ఈమాటలకి పెదిమలు కదిలిస్తారు.

"నీకు చావేమొచ్చె. పొట్టఉబ్బేటట్లుగా నవ్వుకుంటున్నావుగా. ఆరోగ్యం ఎటువంటి రోగం నీకు రానియ్యదు."

"చంపలేసుకుంటున్నాను. ఇంకెప్పుడూ......"

దీపందగ్గిర కూర్చుని చదువుకుంటున్న రాజు నోటికిచెయ్యి అడ్డుపెట్టుకుని మెత్తగా నవ్వుతాడు.

"కుక్కబుద్ధి నీది. ఇలా ఎన్నిసార్లవ లేదూ?"

"ఇహ లేవండి. సాగదీసినకొద్దీ మొండి కేస్తారు మీరు. రాజు నవ్వుతున్నాడు కూడా—మీ అలుక చూసి. పెద్దవాళ్ళమైనందుకు......"

ఎవరో తట్టి నిద్రలేపినట్లు అప్పుడు ఒకసారి మంచం మీద నుంచి క్రిందకు గెంతుతారు.

నాకెంత ఆలోచించినా అందులోఆయన సీరియస్ గా తీసుకోవాల్సిందేమీ నాకు కన్పించదు. హాయిగా అందులో నిహాస్యాన్ని ఆయనా పంచుకుంటే అందమూ, ఆనందమే కాక ఆరోగ్యం కూడాను.

చెప్పొద్దూ—అప్పుడప్పుడు, సంధ్య వేళ, ఆరుబయట పడుకున్నప్పుడు అనిపిస్తుంది గదా— నేనేగనుక ఆరోగ్య శాఖామంత్రిణి నయితే ఆసుపత్రులలో మందులుంచను; శరీరానికి చక్కిలిగింతలు పెట్టి, మనసుకు హాయిని చేకూర్చే హాస్యరచన లుంచుతాను. డాక్టర్లవసరం లేదు; స్పష్టంగా, భావస్ఫోరకంగా, వినసొంపుగా చదవగలవాళ్ళు కావాలి (ఆడవాళ్ళకు ప్రిఫరెన్సు ఉంటుందనుకోండి)

ఈ ప్రణాళికమీద నాకింత ప్రగాఢ విశ్వాసమెందుకూ—అని మీరు ప్రశ్నించవచ్చు. నేనింతవరకు ఒక్కపూటయినా మంచమెక్కలేదు. పిల్ల ఆ విషయంలోనూ అంతే! తల్లి ఆరోగ్యంగా ఉంటే పిల్లల నారోగ్యంగా ఉంటారా?

ఇలా ఊహించుకుంటూ ఉంటానా ఆనాటి సంఘటన సినిమాలాగా కళ్ళముందు సాగిపోతుంది.

* * *

సాయంత్రం అయిదుగంటలయింది. జడ వేసుకుందామని కూర్చున్నాను.

"అమ్మాయోయ్! నీకు జడవేసి ఎన్నేళ్ళయిందో నే! ఉండు వస్తున్నా." అంటూ అమ్మవచ్చి కూర్చుంది.

అమ్మ జడవేసి ఎన్నో ఏళ్లు కాలేదు. మహా అయితే నాలుగునెలలయి ఉంటుంది. దసరాకు పుట్టింటికి పోయినప్పుడు రోజూ అమ్మేగా తలదువ్వి జడ వేసేది.

అడగందే అమ్మయినా పెట్టదంటారు. నేనడగకుండానే అమ్మవచ్చి తలదువ్వుతానంటె నేనెందుకు వద్దనాలి—అనుకుని నూనెసీసా అమ్మ చేతికిచ్చాను.

నూనె రాసి జడ అల్లుతున్నది.

ఏవేవో ఆలోచనలు మనసులో జడ అల్లుకుంటున్నయ్—పుట్టి పెరిగిన ఊరు వదిలిపెట్టా. ఇంకో ఊరుమెట్టాను—తల్లిదండ్రులకూ, అన్నదమ్ములకూ, అక్క చెల్లెండ్రకూ, స్నేహితులకూ దూరమయాను. కొత్తలోకంలోకి ఇష్టమున్నా లేకపోయినా ప్రవేశించాను. ఇక్కడి అనుభవాలూ, అనుభూతులూ పూర్వానికి పూరిగా భిన్నం. నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందంటారు. అందులో నాకు నమ్మకం కన్పించటంలేదు. నానోటిని నేనగుపులో పెట్టుకుంటేమాత్రం ఎదుటివారు మర్యాదగా ప్రవర్తిస్తారని హామీ ఏమిటీ?...

"రిబ్బను ఏదే అమ్మాయ్?" అమ్మ ప్రశ్నించింది.

రిబ్బను ఇచ్చి అద్దంలో చూసుకుంటే రెండు జడలు భయంభయంగా వీపుచాటున దాక్కుంటున్నయ్.

నా ఒళ్ళు మండింది కోపంతో. ఆ రెండు జడలూ బలిసిన గొంగళి పురుగులా కన్పించి ఒంటికి కంపర మెత్తించినయ్. కాపురానికి రాని ముందు రెండుకాదు నాలుగుజడలు వేసుకున్న రోజులుకూడా ఉన్నాయి. కాపురానికి వచ్చింతర్వాత ఒక జడేసుకుంటున్నాను.

విద్యార్థి జీవితానికి, వైవాహిక జీవితానికి సరిహద్దు వెంట్రుకవాసే అయినా అంతరం కొండంత. ఆనాటి సర్దాలు, షికార్లు, కలలు వేలు; ఈనాటి బాధ్యతలు, బరువులు, సత్యాలు అందుకు భిన్నం.

విద్యార్థిజీవితంలో రెండు (సమయానుకూలముగా రేట్లుమారును-అన్నట్లు ఒక్కొక్కప్పుడు నాలుగు, అయిదు) జడలు వేసుకుని, స్లిప్పర్స్ తొడుక్కుని, ఒంటిమీద నిలవకుండా నిమిష నిమిషానికి జారిపోయే జార్జెట్టుసిల్కుచీర పమిటను ఒకచేత్తో సర్దుకుంటూ, రెండోచేత్తో నాజూకుగా పుస్తకాలో (కాలేజీకి వెళ్ళే సమయంలోనయితే) లేక హాండ్ బాగో (షాపింగుకయితే) పట్టుకుని రోడ్డుమీద పోతుంటే-వెనకబడే విద్యార్థులవెకిలిచేష్టలకు కోపగించుకోకుండా, బాధపడకుండా (కోపగించుకున్నా, బాధపడ్డా లాభంలేదు కాబట్టి) స్పోర్టివ్ గా తీసుకుని వాళ్ళని వెంట తిప్పుకునే అనుభూతికీ, అనుభవానికీ-సాంసారిక జీవితంలో కూడా గురికావటం హాస్యాస్పదంగానూ, అమర్యాదగానూ ఉండదూ!

ఉంటుంది అనటానికి నిదర్శనం—మా చెల్లెలు పెళ్ళికి పోతూ కొత్తసిప్పర్లు తొడుక్కుపోయి నేనూ, మావారుపడ్డ అవస్థే!

"ఇంకోరిబ్బను లేదుటే?"

"నన్నడగకుండా రెండుజడ లెందుకేశావ్?" నాకోపం మాటల్లో సగం చూపించి, శేషార్ధభాగంతో వేసినజడ విప్పబోయాను.

"మాతల్లికదూ! నాకు మనసయి అల్లాను రెండుజడలు. ముందుగానీకు తెలిసే ఒప్పుకోవనే చెప్పకుండా వేశాను. రెండోరిబ్బను తీసుకురా..." అని అంటూన్న అమ్మ మాటల్లో ఆమెహృదయంలోని కోరిక ప్రతిఫలించి మంటలాఎగసిన నాకోపాన్ని ఆర్పేసింది.

రెండోరిబ్బను తెచ్చిఇచ్చాను.

"ఎందుకేఅమ్మా! ఇప్పుడు రెండుజడలు. ఇక్కడకు వచ్చింతర్వాత వేసుకోవటం మానేశాను. అదిగాక ఇవ్వాళే మయినా పెళ్లా, పేరంటమా?"

"పెళ్లీ, పేరంటమూ లేకపోతే పిక్చర్లు లేవూ? ఈ పూరొచ్చి ఎన్ని సినిమాలు చూశావో నాకు చెప్పు ముందు?"

అకస్మాత్తుగా అమ్మ వేసిన ప్రశ్నకు వెంటనే నేను సమాధానం చెప్పలేకపోయాను. నేను వచ్చి నాలుగు నెలలయింది కాని ఒక్కసినిమా చూసినపాపాన పోలేదు. ఇదేగనుక మాఊళ్ళోనయితే ఎంతలేదన్నా నాలుగు మూడులు—అంటే పన్నెండు—చూసేదాన్ని. ఇక్కడకు వచ్చినప్పటినుంచీ వారికి ఆఫీసువర్కుతో క్షణం తీరిక ఉండటం లేదు. కాని ఆమాట చెప్తేఎలా? అమ్మ దెప్పిపొడుస్తుంది. ఇంత ఆలోచించి—

"అబ్బో! చాలాచూశా. లెఖ్ఖలేదు" అన్నాను.

అదేమిటే! లెఖ్ఖలేనన్ని చూశావా! ఆ అబ్బాయికి నీకు సినిమాలు చూపించటం తప్ప వేరే పనేమీ లేదా ఏమిటి? ఉద్యోగానికి రాజీనామా ఏమయినా ఇచ్చాడా-నాకు తెలియక అడుగుతాను"

అమ్మ నోరునొక్కుకుంది.

# శ్రీవారితో సినిమాకు ★

వారిభగవంతుడా! మంచికిపోతే చెడు ఎదురయిందన్నట్లుగా ఉండేపరిస్థితి అనుకుని—

"అహా. అదికాదే లెక్కలేదు - అంటే లెక్కలేనన్ని అనికాదు. లెక్కపెటలేదూ అని నా ఉద్దేశం. ఇప్పుడు గుర్తొచ్చిందయ్ లే. మూడు సినిమాలే చూసింది. ఈ నాలుగు నెలలవుగాను. సగటున నెలకు ఒకటికూడా పడలేదు ఇంతా చేసి."

"ఊ! అల్లా అన్నావు బాగుంది. నేచెప్పినపని చేస్తావా?" అని ప్రశ్నించింది అమ్మ, కొంచెం చల్లబడి.

నువ్వు చల్లబడాలేగాని నేను చేయందేముంది అనుకుని "అమ్మ! నే చెప్పడయినా నీమాట కాదన్నానా చెప్పు." అన్నాను (ఇప్పుడు గురుతేదిగాని బహుశా బింగమూతి కూడా పెట్టే ఉంటాను.)

"కాదన్నావని నేనన్నానా చెప్పు..." కూతురుపతిగ అమ్మే ననిపించింది.

"అహా, నువ్వనలేదనుకో..."

"మీఆయన రాగానే చక్కగా ఇద్దరూ కలిసి సినిమాకు పోయిరండి."

వెనకటికెవడో వాడా దొరికిందని గుఱ్ఱాన్ని, బండినీ కొన్నాడుట. రెండు జడలు వేసుకున్నానుగదా అని సినిమాకు పోవాలి!

వారి ఉద్దేశమెలా ఉందో కనుక్కొని పోవచ్చు ననుకుని నీళ్లుపోసుకుని చీరకట్టుకున్నాను.

అంతలోకే వారు ఆఫీసునుంచి వచ్చారు. చీలమండలకడ్డం పడుతున్న కొత్తధోవతిని చేత్తో పైకిపట్టుకుని. అది ఆఫీసులో కనీసం ఒకసారయినా ఊడకుండా ఉందాఅని నాకు సందేహం కలింది.

వారు ధోవతి కట్టుకున్నదల్లా పెళ్ళిలోనూ, శోభనంనాడూను. పెళ్ళినాడు వాళ్ల మేనమామ కట్టాడుట. శోభనంనాడు మాత్రం తనే కట్టుకున్నానంటారు— అదెంతవరకు నిజమోగాని. ఎప్పుడయినా సెర్ఫుకో నేయండి మొత్తానికి ధోవతి కట్టుకోవటమంటూ చేతనయిందిగాని కట్టుకుని ఊడిపోకుండా నడవటం, ఫ్రీగా ఫీలవటం ఇంకా అలవాటు కాలేదనే చెప్పాలి.

సెలవు దొరక్కపోవటంతో సంక్రాంతి పండుగకు పుట్టింటికి పోవటం అందుకని అమ్మ కొత్తచీరా, కొత్తధోవతుల చాపూ తెచ్చింది. ఆ ధోవతి వారికీయమంటుంది.

"ఆఫీసుకెందుకే అలవాటులేని ఔపోసన ఇంట్లో కట్టుకుంటారులేద్దూ" అని నేనంటే ఊరుకుంటా? ఉహూ!

"కొత్తది తెచ్చినందుకు కట్టుకోమనవే నువ్వుమరిను అతను కట్టుకోవటలేదుగా."

తాము పెట్టిన కొత్తబట్టలు అల్లుడు కట్టుకుంటే చూడాలని అమ్మ సర్దాపడుతున్నదిలే, కానీయమనుకుని, ఆఫీసుకు పోవటానికి తయారవుతున్న వారికీ విషయం చెప్పాను.

"ఆఫీసుకు ధోవతే! ఇంకేమయినా ఉందీ!"

ఎక్కడ ఊడిపోతుందో సహా—సుహాస్తాలముందు పరిహాసాల పాలు కావాల్సి వస్తుందేమో—నన్న భయంతో వారు అదిరిపడారు.

"కాని మా అమ్మ మనసు పడుతున్నదండి."

"కాదనవాక. కొత్తవి పంపించారు మీ మామగారు. పండగకు రాలేదని ఎంతగానో అనుకున్నారాయన. ఆయన పంపించినందుకూ, నేను తెచ్చినందుకూ కట్టుకో. అమ్మాయికూడా చీర కట్టుకుంది..." అమ్మ గడపవతల నిల్చుని అందుకుంది.

వారిక మాట్లాడలేక పోయారు.

కష్టాల్లోఉన్న భర్తను రక్షించటం భార్య విధి అనుకుని—

"ఆఫీసుకు ధోవతి కట్టుకుని రాకూడదుటే..." అని బొంకాను.

"నన్ను మరీ అంత పిచ్చిదాని క్రింద లెక్కకట్టవాకే. నాకూ తెలుసును అమాత్రం అందరూ లాగూ చొక్కాలూ తొడుక్కుపోతున్నారా ఏం? ఎంతమంది ధోవతుల్తో పోవటం నేను చూడలేదూ?"

"సరేలే పద. కట్టుకుంటారు" అని నేనూ గదిలోంచి బయటకు వచ్చేశాను.

అయిదు నిమిషాలు. పది నిమిషాలు గడిచినయ్ వారు గదిలోనుంచి ఎంతకీ బయటకు రారే! ఏం తిప్పలు పడుతున్నారో అని గది వాకిట్లోకి పోయి చూద్దును గదా—లోపల పచార్లు చేస్తున్నారు. రిహార్సల్సే కాబోలు. గోడచాటున నిల్చుని తొంగి చూస్తున్నాను. పదిసార్లు అటూ ఇటూ నడిచేసరికి ధోవతి కాస్తా ఊడిపోయింది బెదురుకళ్లతో వాకిలివేపు చూశారు. నేను కన్పించాను.

గబగబా కట్టుకున్నారు. "బెల్ట్ పెట్టుకోండి—ఊడిపోకుండా ఉంటుంది" అన్నాను.

"గుడ్ అయిడియా!" అంటూ బెల్ట్ పెట్టుకుని వెళ్ళిపోయారు...నిర్భయంగా!

ఆఫీసులో ఎన్నిసార్లు ఆ ధోవతి భూదేవతకు సాష్టాంగప్రణామాలాచరించిందో ఆ సీతమ్మతల్లికే తెలియాలి. ఇంటికిమాత్రం బాగానే వచ్చారు.

పొద్దున కట్టిన కొత్త చీర కాక మరొక కొత్తచీర, రెండు జడలూ, చూసేసరికే వారు గ్రహించి ఉంటారు...ఏదో ఉందని.

కాఫీగ్లాసు అందిస్తూ—"అమ్మ రెండు జడలు వేసి, వేశాను గదా సినిమాకు పొండి అంటున్నది—" అన్నాను.

"పోదామంటావా?"

"మీ ఇష్టం."

కొత్తగా కాపురానికి వచ్చినభార్య—సామాన్యమైన భార్యకూడా కాదు, ఏరికోరుకున్నది, అందమయినది (మా అమ్మ మాటల్లో చెప్పాలంటే)—నోరుతెరచి సినిమాకు పోదామా అని మొదటిసారి అడిగితే కాదనే నిగ్రహమూ ధైర్యమూ ఏ మగవానికుంటాయి? ఇలాఅన్నందుకు కొందరు మగవారు నామీద ఆగ్రహించవచ్చు. షివల్రీ ఉన్న మా వారికి మాత్రం కాదనే ధైర్యం లేదు.

టైము చూశాను, ఆరుగంటలయింది. ఫస్ట్ షోకి ఇంకా పావుగంటమాత్రమే టైముంది. దగ్గఱలోఉన్న హాలు రెండు ఫర్లాంగుల దూరం. వారు రిక్షా ఎక్కరు: సాటిమానవుని చేత తనను లాగించుకోవటం వారి మనసు ఒప్పని విషయం. నడచిపోవాల్సిందే.

"అయితే ఉండు. ఈ ధోవతి విప్పేసి, పాంటు వేసుకువస్తాను" అన్నారాయన.

"నా అనుమానం నిజమేఅయిందన్నమాట. ఆఫీసులో ఎన్నిసార్లు ఊడిందేమిటి?"

"అహా. ఊడిపోలేదు." అభిమానం బహుశా నిజాన్ని దాచేసి ఉంటుంది.

'మరింకేం ఉంచుకోండి... టైముకూడా లేదాయెను."

మెయిన్ రోడుమీదికి వచ్చాము. బయల్దేరబోయే రైలుకూతవిని పరుగులు తీసే ప్రయాణీకుల్లా జనం ముందు వెనుకా చూసుకోకుండా పోతున్నారు. ఉన్న గొంతు పెట్టుకుని గద్దించి సైకిల్ రిక్షాను పక్కకు తొలగించి ముందుకుపోతున్న సిటీ బస్సును మెత్తగా కోప్పడి వెనక్కినెట్టేసి స్టడీ బేకరు దూసుకుపోతున్నది.

ముంగుచూపేగాని పక్క చూపులేని నన్ను మల్లెపూల పరిమళం ఆకర్షించింది. ఎక్కడినుంచా యీ సుమసౌరభం అని చూశాను. విచ్చుకున్న మల్లెలూ, మల్లెల తెల్లదనాన్ని చూసి అసూయతో మొహం ఎఱ్ఱబుచేసుకున్న కనకాంబరాలూ వీటన్నింటినీ మించి అందాల హొయలు విరజిమ్ముతున్న ఎఱ్ఱ గులాబీలు.

"పూలు కొనుక్కుందాం ఆగండి:" అన్నాను ఎటో చూస్తూ నడుస్తున్న వారికి.

"ఆలస్యమవుతున్నది. అప్పుడే ఆరుంబావయింది టైము"

(47-వ పేజీ చూడండి)

# ★ శ్రీవారితో సినిమాకు ★

(30-వ పేజీ తరువాయి)

"మీది మరీ సోద్యమండి. పూలుకొంటం ఎంతసేపు?"

ఏమనుకున్నారో ఏమో ఆగారు. తెల్లని మల్లెలమీదకు మనసు పోతున్నదిగాని అవి దండ గటిలేవు. కనకాంబరాలకూ, నాకు చుక్క చాలాదూరం ఉంది. అంబరానికీ, నాకూ ఉన్నంత.

రెండు ఎఱ్ఱగులాబీలు తీసుకున్నాను. ఖరీదు పావలా చెప్పాడు.

ఎవరయినా తను చేస్తున్నపని కనిపెట్టు న్నారేమోనని భియపడే జేబుదొంగలాగా వారు రోడ్డుమీద అల్లంతదూరాన నిల్చుని దిక్కులు చూస్తున్నారు- బెదురు కళ్లతో ఎందుకు వారికంత భియం? పూలుకొనుక్కోవటం తప్పుపనవుతుందా?

"ఏమండోయ్! మిమ్మల్నే" కొంచెం పెద్దగా కేక వేశాను. బజారు గోలలో విన్పించ లేగా మరి—

మొహం చిట్లించుకుని-"ఎందు కంత గావు కేక వేస్తావ్? రోడుమీద-" అంటూ రెండడుగులు ముందుకు వేశారు.

"నేను గావు కేకలేశానా? కొంచెం పెద్దగా పిల్చానుగాని... లేకపోతే యీ రణగొణ ధ్వనిలో మీకు విన్పించేదెలా?"

"సరే! ఇహ చాలించు - రోడ్డుమీద మన పోట్లాటవింటే ఎవరయినా నవ్వుతారు."

"పోట్లాట ఏముంది ఇందులో. ఒక పావలా ఈయండి."

"పావలా? పావలాలేదే! అర్ధరూపాయి ఉంది" అంటూ జేబులోంచి అర్ధరూపాయి తీసిఇచ్చారు వారు.

"నాదగ్గఱ చిల్లరలేదండి" అన్నాడు పూలమ్మే మనిషి.

"అదేమిటి? అర్ధరూపాయి చిల్లర లేకుండా నువ్వు అమ్మేదేమిటా మరి?"అని ప్రశ్నిస్తే-

"ఇప్పుడే ఒకాయన రెండురూపాయల కాగితం తెచ్చి పావలాపూలు కొనుక్కెళ్ళాడు...అందుకని చిల్లర లేకపోయిందండి" అన్నాడు

"మరయితే ఏం చేయమంటావ్?"

"నేనేం చేసేది?"

ఎం చేద్దామంటారు?- అన్నట్లు వారి వంక చూశాను.

"మనకు రావాల్సింది పావలాఏగా పోనిద్దూ."

"ఇది మరీ బాగుంది. పావలాపూలకు పావలా దానమా?"

"అలా అనుకునేదానివి ఆ పావలా వికూడా తీసుకో."

"ఇంకే మక్కరా? పూలకే అర్ధరూపాయి పెట్టే..."

పావలా పోతేపోయింది- అంటూ ఆయన ఒకపక్క చిరాకుపడతారు. చూస్తూ, చూస్తూ పావలా వదులుకో బుద్ధికావటం లేదు; అర్ధరూపాయి పెటి పూలుకొన మనసొప్పటమూ లేదు.

వారికేమో ముళ్ళమీద నిల్చున్నట్లున్నది నే పూలబేరం చేస్తుంటే.

"పోనీ పావలా రేపు తీసుకోవచ్చును లెద్దూ" అన్నారు వారు- ఇహ అక్కడ నిల్చోవటం ఇషంలేక.

"మీరు రేపు గురుపెట్టుకుని పావలా తీసుకురావటం కూడానా; ఒకవేళ మీకు గురున్నా- యీ మనిషి రేపు మీకు కన్పిస్తాడని నమ్మకమేమిటి?" అని వారితో అని "చిల్లర లేదంటుంటివి. నీపూలు నీవు తీసుకో-" అన్నాను పూలమనిషితో. అంత కన్నా చేయకల్గేది నాకు మరేమీ కన్పించలేదు.

"చిల్లరలేదని పూలు కొనుక్కోకపోవటం ఎందుకులెండి అమ్మగారూ! తీసికెళ్ళండి. డబ్బులు రేపిద్దురుగాని లెండి".

ఆ ఆలోచన నాకు తటలేదు సరికదా వారికయినా స్ఫురించలేదు. నోరు వాదనకు దిగేసరికి మనకు నల్లమందుమింగి కూర్చున్నది.

పూలుతిసుకుని రెండడుగులు ముందుకు వేశాక-

"పూలవాడికున్న సంస్కారం నీకు లేకపోయె?-" అన్నారు వారు.

"అంటే!"

"వాడిదగ్గఱ పావలాడబ్బు లుంచటానికి నువ్వు వాడ్ని నమ్మలేకపోయినావు కాని వాడుమాత్రం ముక్కూ-మొహం ఎఱుగని నిన్ను నమ్మాడు."

"నమ్మదగనివాడు కాబట్టి మనం వాడ్ని నమ్మలేదు."

"నిన్ను వాడు "ఎందుకు నమ్మాలి?"

వారి ప్రశ్నకు నేను సమాధానం చెప్ప లేక "అయితే వాడిపూలు వాడికిచ్చేద్దాం పదండి-" అన్నాను.

"ఇప్పుడు పోయి ఇయ్యమని కాదు నే చెప్పేది. అసలువిషయం చెప్తున్నాను. పూలు పెట్టుకో."

జాగ్రత్తగా, పువ్వునలగకుండా చూసుకుంటూ ఎడమజడలో ఒకటీ, కుడిజడలో ఒకటీ పెటుకున్నాను. ఆయన ఇంకో గులాబీ అందించాడు సన్నగా నవ్వుతూ.

"ఇది క్కడది?"

"జడనుంచి పడుతుంటే పట్టుకున్నాను"

ఎంత ప్రయత్నించినా పువ్వు జారిపోకుండా పెట్టుకోవటం కుదరటంలేదు. అదో పెద్దసమస్యై కూర్చుంది. కళ్ళవెంబడి నీళ్ళు గిరగిరా తిరిగినయ్.

"మీరు పెట్టరూ. నాకు చేతకావటంలేదు" బతిమిలాడుకున్నాను. అభిమానానికి పోతే లాభం లేదనుకొని.

వారు శతవిధాల పైకి రానీయకుండా మింగుతున్న నవ్వు దానంతటదే దిగజారిపోయింది మరుక్షణంలో. మొహం వికర్షమయింది దిక్కులు చూడసాగారు.


పెరీరావారి

షీమార్

కుటుంబానికంతా ఉపయోగి
పడు దగ్గు నివారిణి

దగ్గులు,
జలుబులు
మరియు
బ్రాంకైటిస్
బాధల
నివారణకు
దివ్య ఔషధం.

పై జబ్బులకే గాకుండా గొంతు, ఊపిరితిత్తులు, రొమ్ము జబ్బులకు అమోఘమైన వైద్యుల గట్టి నమ్మకపు సలహా ఈ దివ్య ఔషధమే.

Shemar

విల్‌ఫ్రెడ్ పెరీరా
ప్రైవేట్ లిమిటెడ్
ఔషధాల తయారీదారులు
మద్రాసు-7
భారత దేశమంతటా స్టాకిష్టులు కావాలి
WPL TQ

# ★ శ్రీవారితో సినిమాకు ★

వీరికంత భయమేమా అనిపించింది. మగవాడి బలహీనత అంటే ఇదే కాబోలు!

"ఫర్వాలేదులెండి. మనసెవరు చూడవచ్చారు? ఎవరిగోడవ వారిది!"

"పుణ్యానికిపోతే పాపమెదురయిందిట. క్రిందపడుతున్నదికదా అని పట్టుకున్నందుకు ఇదాశిక్ష!"

వెనక్కి తిరిగి కదలకుండా నిల్చున్నాను. ఆయన పువ్వు జడలో సర్దుతున్నారు.

ఈ దృశ్యం ఏ సినిమాలోనూ చూడటంగాని ఏ పుస్తకంలో నయినా చదవటంగాని తటస్థించలేదో ఏమో... సైకిల్ మీద పోతున్న కాలేజీ విద్యార్థి ఒకడు రెండు కళ్ళూ ఇటు పారేసి (ఇదేదో వింత సంఘటన అన్నట్లు, 'సంచితరుణం మించిపోవు నన్న భావంతో) సైకిల్ ముందుకు తొక్కుతూ-డ్యూటీ పూర్తి చేసుకుని రోగాలఊబి, మందుల కంపునుంచి బయటపడి 'బ్రాసియర్స్' సరిగా ఉన్నాయో లేదో, గౌను మీద ముందుమరక లేమీ అవలేదుగదా - అని చూసుకుంటూ తల వంచుకు నడుస్తూన్న నర్సును ఢీకొన్నాడు.

మల్లెపువ్వులా ఉన్న నర్సు గౌనును సైకిల్ ముందుచక్రం మట్టిచేసింది. ఆమెకెక్కడలేని ఆగ్రహమూ వచ్చింది—దెబ్బలేమీ తగిలినట్లు లేవుగాని, గౌను మట్టి అయిందనే ఆమె బాధ! మొగుడు కొట్టినందుకు కాదుగాని తోడికోడలు నవ్వినందుకన్నట్లు—ఆమె మొహం కోపంతో కందిపోయింది. క్రిందపడ్డ కాలేజివిద్యార్థి లేచి "ఐయామ్‌సారీ!" అంటూంటే ఏమంటానికీ తోచని ఆమె పెదవులు కంపించినయ్—పెనుగాలికి అల్లల్లాడే తలిరుటాకుల్లాగ.

ఇదంతా చూస్తున్న నాకు చెడ్డనవ్వు వచ్చింది. ఆపుకోలేక నవ్వేశాను. ఆ నవ్వటంలో కదిలాను కాబోలు జడలో మా వారు అవకష్టాం పడుతూ సర్దుతూన్న పువ్వు కాస్తా క్రింద పడిపోయింది.

వెనక్కి తిరిగి చూద్దునుకదా దారిన పోతున్న ఒక ఇల్లాలు భర్తనాపి వేలుపెట్టి మరీ మమ్మల్ని చూపిస్తున్నది.

సిగ్గుతో చచ్చిపోయాను నేను. ఆయన అలిసిపోయారు.

దీర్ఘంగా నిట్టూర్చి క్రిందపడ్డ పువ్వును తీయటానికి వంగాను. వారి అవస్థమాట అలావుంచి "క్రిందపడ్డ పువ్వును తల్లో పెట్టుకుంటే ఈమె"—అని నలుగురూ ఆక్షేపిస్తారేమో నన్న శంకతో "క్రిందపడ పువ్వు ఎందుకు లెద్దురూ?" అన్నాను. చేతిలోకి తీసుకున్న పువ్వును వారు జార విడిచారు.

"ఐపిటియు మిసర్ భాస్కరం!" అని వెనకనుంచి ఎవరిదో స్త్రీ కంఠం విన్పించింది. ఇద్దరమూ ఒక్కసారి అటు చూశాము సంధ్య! మా వారి క్లాసుమేటు. పెళ్ళిమీద నమ్మకం లేనిపిల. (మా వారి మాటల్లో చెప్పాలంటే పెళ్ళి అవసరం లేనిపిల్ల.) టెలిఫోన్ ఎక్ఛేంజిలో పని చేస్తున్నది.

"చేయిజారి క్రిందపడ పువ్వును అలా వదిలివేయటమా! వాట్ ఎ హారిబుల్ థింగ్? దానిసౌందర్యం, సౌరభం అలా నేలపాలు కావాల్సిందేనా? దారినపోయే నలుగురి కాళ్ళక్రిందపడి నలిగి పోవాల్సిందేగా అది? ఏమండీ! రాధారాణిగారూ! చదువుకున్నవారు, సంస్కారులు—ఇదా చేసేది?"

"దుమ్మయిందికదా—తలలో ఎలా పెట్టుకుంటాం? ఆరోగ్యకరం కాదు."

"దుమ్ము కేముందండి? దులిపితే పోయె. ఇంతికీ మీ కిష్టం లేదు. ఇష్టమున్న భాస్కరం బలహీనుడు."

"అంత సానుభూతివుంటే మీరు తీసుకోండి." కొంచెం కఠినంగానే అన్నాను.

ప్రయాణిస్తున్న ఒక విమానంనుండి ఒకవ్యక్తి పారాచూటుతో క్రిందకు దిగబోతూ అందులో వున్న ఒక్క ప్రయాణికుణ్ణి ప్రశ్నించాడు!" మీరు కూడా నాతోపాటు పారాచూటులో దిగుతారా?

"నేను ఛస్తేదిగను. ఇంతకూ మీరెవరు? "ప్రశ్నించాడు ప్రయాణికుడు.

"నేను ఈ విమానం పైలట్‌ను" జవాబిచ్చాడు ఆ వ్యక్తి.

ఆమాటలకు ఆమె మొహం మాడిపోయింది.

"నేనసలు పూలు పెట్టుకోను—మీకు తెలియదేమో."

"పూలు పెట్టుకోవటం ఫాషను కాదు కాబోలు—నాకు తెలియదులెండి."

"తలలో పెట్టుకున్నంత మాత్రాన పువ్వును పూజిస్తున్నట్టా? నేను మనసుతో ఆరాధిస్తాను." అంటూ ఆమె ఆ క్రిందపడ్డ పువ్వుం తీసుకుని—

"వస్తాను. నాకో ఎంగేజిమెంటుంది" అంటూ వెళ్ళిపోయింది.

ఒక జడలో పువ్వు పెట్టుకుని, రెండో జడలో పెట్టుకోకపోవటం బాగుండదని ఉన్నదికూడా తీసి పారేశాను. వారేమీ మాట్లాడలేదు.

నాలుగడుగులు ముందుకేసి వెనక్కి తిరిగి చూద్దునుగదా సంధ్య గులాబీ పువ్వును ఉండచుట్టి సెడ్ కాలవలో పారేసింది. చెప్పేవి శ్రీరంగనీతులు...అన్న పద్ధతిలో ఉంది.

సినిమాహాలుకు చేరుకునేసరికి ఆరున్నరయింది. హాల్లో లైట్లార్పేసి ఉన్నయ్. ట్రయిలర్లు వేస్తున్నట్టున్నారు. వారు టిక్కెట్టు కొనటానికి బుకింగ్ ఆఫీసు దగ్గరకు పోయారు.

"ఏయ్! ఆపు...ఇక్కడే ఆపు!" అని పెద్దగా కేకలు విన్పించినయ్. ఏమిటా అని చూసే రెండు సైకిల్ రిక్షాల్లోనుంచి బిలబిలా నలుగురు పిల్లలు—ఇద్దరు మొగపిల్లలు, ఇద్దరు ఆడపిలలు—తత్తరపడుతూ నలభై ఏళ్ళ ఇల్లాలొకామె, తాపీగా కోటూ, బెల్టూ సర్దుకుంటూ బట్టతలాయన—ఒక్కసారి దిగారు.

—[మిగతా పైవారం]


కుటుంబ నియంత్రణం
గర్భనిరోధానికి
స్త్రీలు సేవింపదగిన ఔషదము స్పెక్ టేబ్‌లెట్స్ (రిజష్టర్డ్) గర్భమురాకుండేందుకు తేలికగానోటిలోవేసుకొని మింగేమందు|2 రోజులు మందు వాడిన యడల గర్భధారణ కాకుండా చేయును..
పూర్తికోర్సు ప్యాకెట్టు 24 మాత్రలు వెల రు 12/- వి పి అదనము
ప్రతిచోట దొరుకును
ఇండియాలోను, విదేశాలలోను ఈమందువాడినవారు అయాచితంగా అనేక యోగ్యతాపత్రములను పంపియున్నారు...


SEENU & CO.,
28 K TANDAVARAYA GRAMANI ST • MADRAS-21
GRAMS ORCAS (ESTD 1946), PHONE 35557
(ADVT. PERMITTED UNDER G O MS. NO. 1181 HEALTH)



కొండముది హనుమంతరావు

(గతసంచిక తరువాయి)

మా(ద) శుద్ధిగా మూడు రూపాయలు చెల్లించి రెండు రిజర్వుడు టిక్కెట్లు కొనుక్కొని వస్తున్న మావారి మొహం ఈ కుటుంబాన్ని చూసేసరికి తెలతెలబోయింది. గుటకలు మింగుతూ "నమస్కారమండీ!" అని చేతులు జోడించారు మావారు ఆ బట్టతలాయనకు.

ఎవరో యీ దైవ సమానుడని నేను ఆలోచిస్తున్నాను—ఆఫీసు సూపరింటెండెంటును తండ్రితో సమానం అంటే ఆయన్నసలు 'ఫాదర్' అనాలని చెప్తుంటారీయన. సూపరింటెండెంటుగారేమో స్కూల్ ఫైనలేనుట ప్యాసయింది. మా వారేమో ఎంతచెడ్డా (చెడ్డటం పైకంగా కాదనుకోండి. థర్డ్ క్లాసులో ప్యాసవటం) అనర్సుగా! నిజం చెప్పొద్దూ ఇంగ్లీషుముక్క తడుముకోకుండా మాట్లాడుతారు. వ్రాయటంకూడా నుంచి భాషే వ్రాస్తామంటారు. అదెంత నిజమో (అంగం తెలిసిన) భగవంతుడికే తెలియాలి! సూపరింటెండెంటు పెద్దవాళ్ళతో ఇంగ్లీషులో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలంటే మావార్నే పిలుస్తుంటారుట. ఇలా చాలా ఉన్నాయి కారణాలు.

వాని చిన్నప్పటి గురువుగారేమోనంటే—గురువును దైవ సమానంగా చూడవలెనని సుమతీ శతకంలో చదువుకున్నారేమోగాని ఆచరణలో కాదు సరిగదా అంతర్యంలో కయినా అలాంటి సద్భావం ఉన్నట్లు నేనెప్పుడూ ఎఱగను.

మావార్ని చూసి బట్టతలాయన కోటు జేబులు గాభరాగా తడుముకోసాగారు.

"పర్సు తేవటం మర్చిపోయినట్లున్నానే!"

"ఇంత మతిమరుపేమండీ! మీతో చచ్చిపోతున్నాను నేను. ఇప్పుడెలా? అసలు తెచ్చారా? తేకపోతే దోవలో ఏమయినా పారేసుకున్నారా?"

ఆ ఉత్తమ ఇల్లాలి మాటమీద నమ్మకం నిండుగా ఉందో ఏమో ఆ మానవుడు నేలమీద వెదకటం మొదలుపెట్టాడు.

"రిక్షా ఎక్కేటప్పుడు తాతగారిదగ్గర నుంచి నువ్వు తీసుకుంటివి గదుటే అమ్మా!" పెద్దపిల్లవాడు గుర్తుచేశాడు.

"అయ్యో! నా మతి మండ! నిజమే నండోయ్. ఇదిగో పర్సు!" అంటూ ఆమె బాడీ నుంచి పర్సుతీసి, లెక్కపెట్టి ఆరు రూపాయి కాగితాలు మావారికిచ్చి, "నాలుగు రిజర్వుడు తెచ్చిపెట్టు భాస్కరం" అన్నది.

"అలాగే!" అని వారు బుకింగ్ ఆఫీసు దగ్గరకు పోయారు.

చిన్నపిల్లలిద్దరూ గేటులోనుండా ట్రయిలరు చూస్తున్నారు. పెద్దపిల్లలిద్దరూ గోడల కంటించిన పోష్టర్లు కళ్ళు పెద్దవిచేసుకుని చూస్తూ వాటిమీద వ్రాసిఉన్న అక్షరాలు చదువుతున్నారు.

"అమ్మాయ్! మీ ఇద్దరేవచ్చారు. పిల్లలు లేరా?" అని ప్రశ్నించింది స్థూలకాయురాలు.

బట్టతలాయన వారెండు జడలూ, స్లిప్పరూ మార్చి మార్చి చూస్తున్నవాడు కాస్తా భార్యమాటలకు సన్నగా నవ్వి—"ఎవరనుకుంటున్నావ్ అమ్మాయి?" అని సూటిగా ప్రశ్నించాడు.

"భాస్కరం భార్యకదూ? ఆ మాత్రం నేను గ్రహించలేననుకున్నారేమిటి!"

"బాగుంది నీతెలివి. భాస్కరం చెల్లెలీ అమ్మాయి. భార్యను పురిటికి పుట్టింటికి పంపించాలని కదూ మొన్న సాయంత్రం ఒకగంట ముందుగానే ఆఫీసునుంచి పోయాడు—" 'దైవసమానుడు' ఆఫీసరు అని గ్రహించగల్గాను.

మొదట నేనూ అదే అనుకున్నానులెండి. ఆ ముక్కు మొహం అచ్చగా భాస్కరంతీరే! అయినా మేనత్తా మేనమామ బిడ్డలేమో, పోలికలున్నాయి అని అభిప్రాయపడ్డాను..."

మావారి అబద్దానికి, ఆ అబద్ధాన్ని నమ్మిన ఆఫీసరుగారు భార్య తెలివిని అంచనా వేసి కట్టిన విలువకూ. నలుగురిలో కాకపోయినా ఒక చదువుకున్న అమ్మాయి (అని కాదు—క్లర్కు భార్యనుండు అని మావారు అంటారు) ముందు తనని కుర్ర తెలివితక్కువ వాడమ్మ క్రింద కట్టటంతో ఆ ఇల్లాలి మొహం మార్చుకున్న రంగులకూ, తనబండం ఎక్కడ బయటపడుతుందో నన్న భయంతో టిక్కెట్లు కొనుక్కొని వస్తూ మావారు చూస్తున్న విచిత్ర చూపులకూ—నాలుగు విధాల నాకు పెద్ద నవ్వొచ్చింది. నవ్వు నాలుగంధాల నష్టమంటారు పెద్దలు—అనుకుని సాధ్యమైనంతవరకు వస్తూన్న నవ్వును మింగ ప్రయత్నించి విఫలురాలనై జేబుగుడ్డ నోటికడ్డు పెట్టుకున్నాను.

"పొరపాటుకే అమ్మాయ్! తెలియక అనుకున్నాను భాస్కరం భార్యవని"—స్థూలకాయురాలు తను అన్న నిజానికి నొచ్చుకుంది.

ఎవరు పొరపడ్డారో చెప్తామంటే కథ అడ్డం తిరిగేట్టుంది—మావారి అబద్ధం పునాదుల్తో సహా కూలిపోతుందాయను మరి!

"పేరేమిటన్నావ్?"

చెప్పాను.

"ఏ ఊరిచ్చారు?"

"గుంటూరు" నోటికొచ్చిన పేరు చెప్పాను.

మావారు నోరు తెరుచుకు చూస్తున్నారు. నన్ను గుంటూరిచ్చుట ఏమిటో వారి కర్థంకావటం లేదు.

"ఎవరిసంగతి నువ్వ చెప్పేది?" అని మావారు నన్ను ప్రశ్నించారు.

"వాళ్ళత్తవారి విషయం చెప్తున్నదిలే" అని వారి ప్రశ్నకామె సమాధానం చెప్పి "ఏం చేస్తుంటాడు మీఆయన?" అని నన్ను ప్రశ్నించింది. నాకేం చెప్పాలో తోచలేదు.

"నేనేం చేసేది మీకు తెలియటంలా?" అని అనుకున్నారు మావారు ఆమె ఏ ఉద్దేశంతో ప్రశ్నించిందో అర్థంకాని పరిస్థితిలో.

"నీవిషయం కాదమ్మాయ్ మీబావమరది విషయం నేనడిగేది!"

"మా బావమరది విషయమయితే నన్ని మీ ఆయనేం చేస్తుంటాడంటారేం?"

"మీ బావమఱిది మీ చెల్లెలికి మొగుడా



డోయ్-భర్తకాక" అని ఆఫీసరు మధ్యలో కలుగజేసుకున్నాడు.

మావారి పరిస్థితి చూస్తుంటే నాకు ఎక్కడలేని జాలి కలుగుతున్నది. నావంక అర్థరహితంగా చూస్తున్నారు. తనకేమయినా మతి చెడిందా, లేక ఎదటఉన్న వాళ్ళకేమయినా మతి పోయిందా అన్న సంధిగ్ధావస్థలో పడ్డారాయన.

"కాలేజీలో లెక్చరరు"

"పేరేమిటి?" ఆసక్తితో ప్రశ్నించాడు ఆఫీసరు.

ఏం పేరు చెప్దామా అని ఆలోచిస్తున్నాను. మావారి పేరు భాస్కరరావు కాబట్టే, తత్సంబంధమయిన నామమే చెప్పాలని నా ఉద్దేశం. ఏదో నానోట కొచ్చిన పేరో, నాకు నచ్చినపేరో చెప్తే ఆయన బాధపడవచ్చు. ఆయన బాధమాట అలా ఉంచి చెటంత (మీకు చెప్పలేదు కాబోలుంకా-మావారు మంచి పొడుగు, పొడుగుకు తగ్గలావూ; అందులోనూ ఈ రోజు ధోవతికూడా కట్టుకున్నారో ఏమో-ఏమో ఏమిటో కలుగుతున్నట్లు ప్రత్యక్షంగా కన్పిస్తుంటే-ఒడ్డూ, పొడుగూ కొట్టవచ్చినట్టు కన్పిస్తున్నయ్) మొగుడ్ని ముందు పెట్టుకుని ఎవరిపేరో నేనెలా చెప్పేది మీరే చెప్పండి. సూర్యనారాయణ భానుమూర్తి, రవి...పర్యాయపదాలు ఒక్కటొక్కటే గుర్తుకు తెచ్చుకుంటున్నాను.

"మీది మరీ విచిత్రమండి ఎంత చదువుకున్నమ్మాయితే మాత్రం మొగుడిపేరు చెప్తుందా?" అన్నది ఆమె ముడుతలుపడ్డ ఆమె మోహంమీద స్త్రీ సహజమయిన లజ్జారేఖలు లాస్యం చేసినయ్.

ఇంకా నయం—తొందరపడి చెప్పాను కాదు. ఆలస్యం అమృతం విషమంటారు కాని, ఒక్కొక్కప్పుడు ఆలస్యం అత్యంత సహకారిగా ఉంటుంటుంది. పేరు కనుక నేను చెప్పేఉంటేనా నన్ను సిగ్గూ-శరమూ విడిచిపెట్టిన దానిక్రింద లెక్క కట్టేసేది ఆ ఇల్లాలు.

"ప్రభాకర రావండి" అన్నారు మా వారు-అసలు పరిస్థితి ఇప్పటికి అర్థమయింది కాబోలు.

"ఫిజిక్స్ లెక్చరర్ ప్రభాకరరావేనా?" ఆశ్చర్యపడుతూ ప్రశ్నించాడు ఆఫీసరు.

"ఆ!"-పాత్రకు న్యాయం కూర్చుతూ నే ఉన్నాగదూ?-అన్నట్లు నా వంక చూశారు.

"ఇన్నాళ్ళ నుంచి చెప్పావు కాదేమిటోయ్—ప్రభాకరరావు మీ బావమరదని. వాళ్ళ నాయనా, నేనూ బాల్యస్నేహితులం. పెళ్ళికి శుభలేఖ కూడా వచ్చింది. కాని పోలేకపోయాను."

ప్రభాకరరావంటే రెండేళ్ళ క్రితం-మనం విశాఖపట్నంలో ఉన్నప్పుడు—ఏదో

# ★ శ్రీవారితో సినిమాకు ★

ఇంటర్వ్యూ ఉందని మనింటికి వచ్చాడూ-అతడేనా?"

"ఊఁ. అతడే. రెండురోజు లుండవోయ్ అంటే మా నాన్నగారి వంట్లో బాగాలేదని వెంటనే వెళిపోయాడు."

చాలా మంచి పిల్లవాడు. బుద్ధిమంతుడు. అందానికి అందం, చదువూ ఆస్థి. అనువైన సంబంధం. ఈడూ జోడూ చాలాబాగుంది "

కథ ఇంతదాకా వస్తుందనుకోనని నేను తెల్ల మొహం వేసుకుని నిల్చున్నాను.

"పదండి. సినిమా మొదలెట్టారు" అన్నాడు ఆఫీసరు.

బ్రతుకు జీవుడా! అనుకుంటూ హాల్లోకి పోయి కూర్చున్నాం. మధ్యలో పిల్లలు కూర్చున్నారు—ఆ పక్కన ఆఫీసరు, మా వారూ, ఈ పక్కన ఆఫీసరు భార్య, నేనూ.

"సినిమా ఏమీ బాగాలేదు. నా మనసెంత సేపటికీ సినిమామీద నిలవక ఇందాకటి నుంచీ జరిగిన విషయాలచుట్టూ పరిభ్రమిస్తున్నది. తలుచుకున్న కొద్దీ నవ్వువస్తున్నది.

ఆఫీసరుతో పెళ్ళాన్ని పురిటికి పుట్టింటికి పంపించాలని చెప్పారా? అబద్ధమాడితే గోడ కట్టావట్లుండాలి అంటారు. మరి దెమిటీ వీరు? నాలుగురోజులు పోయిన తర్వాత "ఏమోయ్! భాస్కరం మీఆవిడకన్నదా?" అంటే ఈయ నేంచెపారు. ఇంకా లేదంటారు పోనీ మొదటిసారి. అలా ఎన్నాళ్ళు 'ఇంకా లేదు' అని చెప్తూ ఉంటారు? ఇంత తెలివితక్కువవారేం?

ఇంకా పైగా నాతో నేమో డాబులు చెప్పారు.

అమ్మ మెయిల్లోవస్తున్నది, స్టేషనుకు నాకను రమ్మని తమ్ముడు టెలిగ్రాం ఇచ్చాడనీ.. ఈయన స్టేషనుకు వెళ్లారు. మీ ఆఫీసరు గంటముందుగా ఎలా వదిలారు?—అని అడిగితే "ఆఫీసర్ని మనం అడగటం కూడానా. మనం ఎప్పుడు వెళ్ళదలుచుకుంటే అప్పుడు వెళ్ళవచ్చు..." అన్నారు.

"అంతచచ్చు వెధవాండి గా ఆఫీసరు?" అని అంటే—

"చంపేశావ్! ఆకస్మికమూ, పర్మిషనూ మనకొక్కరికే. మరెవ్వరికీ లేదు మా ఆఫీసులో" అన్నారు మహా బింకంగా.

ఈయన చెప్పిందంతా ఇప్పటిదాకా ఇంకా నిజమే ననుకుంటున్నాను. కాని అసలువిషయం బయటపడింది. పెళ్ళాన్ని పురిటికి పుట్టింటికి పంపాలని ప్రాధేయపడితే, పెళ్లామూ, పిల్లలూగల ఆఫీసరు పాపం దయదలచి వరమిచ్చాడు.

ఆలోచించిన కొద్దీ నాకు నవ్వువస్తున్నది.

ఆఫీసరుభార్య నా మొహంవంక ఎగాదిగా పరీక్షగా రెండు మూడుసార్లు చూసి ఆమె నవ్వసాగింది. నేను సినిమాలోని సన్నివేశాలకూ, సంభాషణలకూ నవ్వుతున్నాననుకుందో ఏమో. హిందీ సినిమాయెను—ఆమెకర్థమయి ఉండవు సంభాషణలు. అదేదో హాస్యసన్నివేశమనుకుని ఆమె నవ్వుతున్నది. నవ్వకపోతే పక్కనున్నవాళ్ళు యీమెకి సినిమా అర్థంకావటం లేదు అనుకుని పోతారేమోనని. ఇదంతా చూస్తుంటే నాకునవ్వు ఆగింది కాదు. జేబురుమాలే శరణ్యమయింది.

నేను జేబురుమాలు నోటికడ్డుపెట్టుకోవటం చూసి ఆమె ఎమిటచెంగు నోట్లో కుక్కుకుంది.

అసలు సినిమా క్లోజ్ గా ఫాలో అవుతున్న ఆఫీసరుకి 'సినిమా' రుచించలేదు.

'మీ రిద్దరూ పొట్టలుబ్బేటట్లు నవ్వుతున్నారుగాని నాకేమంతనవ్వు రావటం లేదే కథ ఇంత సీరియస్ గా ఉంటే మీకిందులో హాస్యమెక్కడ కన్పించింది?—" అన్నాడు ఆఫీసరు మా వైపు తిరిగి.

ఆమె తెల్ల మొహం వేసుకుని నా మొహంలోకి తొంగిచూసింది.

అప్పటికే నేను శతవిధాల ప్రయత్నించి నవ్వు నాపుకోగల్గాను. ఆమె పట్టుబడ్డ దొంగలా మొహం వాల్చుకుంది.

"అమ్మా! మంచినీళ్ళు!" అంటూ ఆరేళ్లపిల్ల అమ్మ తలపై కెక్కింది.

"మంచినీళ్లు కావాలంటే ఇప్పుడెలా వస్తయ్. కాసేపాగు" అమె కసిరింది పిల్లని.

"నాలికెండిపోతుంటే...ఎట్లా గమ్మా. ఎప్పటికయిపోతుందో సినిమా!" మొండికేసింది పిల్ల—దాహం నిజంగానే అవుతున్నదో, లేక కాసేపు బయటకు పోదామని సర్దాయే కలిగిందో మరి!

"పిల్లల్ని తీసుకురావద్దన్నాను అందుకనే నా మాట వింటేగా—అఘోరించు."

పిల్ల మెల్లగా రాగం తీయనారంభించింది. అది గ్రహించిన ఆఫీసరు "ఇహ లాభంలేదు. అది ఊరుకోదు. అలా బయటికి తీసికెళ్లి సోడా ఇప్పించు," అన్నాడు భార్యతో.

"నాకేం తెలుసు సోడా ఎక్కడ ఉంటుందో ఏమో!"

పాపం! నూలకోయరాలాయను. అంత శరీరాన్ని కుర్చీలోంచి లేవదీయటమంటే ఆమెకు ప్రాణంమీదికి వచ్చినట్లుండటం సహజమేగా!

"సోడా ఎక్కడ ఉంటుందో తెలియదు గాని పిల్లల్ని వద్దన్నా సినిమాకు తీసుకురావటంమాత్రం బాగా తెలుసును"

"పిల్లలున్నవాళ్లు సినిమాకు తీసుకురాకుండా ఇంటిదగ్గర వదిలిపెట్టివస్తారా ఏం? వదిలిపెట్టేమటుకు బుదిగావుంటే సంచా వినున్నానా? మీతో నాకిక్కడ పోట్లాట ఎందుకు?" అని మా వారిని ఉద్దేశిస్తూ— "ఇదిగో అబ్బాయ్! భాస్కరం, కాస్త దీన్ని తీసికెళి సోడా పట్టుకురా నాయనా!" చిన్నగా కేకేసింది.

మా వెనకా-ముందూ వరుసల్లో ఉన్న వాళ్లు "ష్" అన్నారు-ఒక్కసారి.

అమ్మగారు ప్రార్థనాపూర్వకంగాఅన్నా అనుల్లంఘనీయ ఆజ్ఞకిందే లెఖ్ఖ.

తప్పేదేముందని మావారిక కుర్చీలోంచి లేచి, ధోవతి ఊడిపోతుందేమోనన్న భయంతో కొబోలు చెంగులు జాగ్రత్తగా పైకి పట్టుకుని, పిల్లని తీసుకునిపోతూఉంటే "ఉండబ్బాయ్! డబ్బు లిస్తాను" అంటూ కొంగు ముడివిప్పసాగింది ఆమె.

"నా దగ్గర ఉన్నాయిలెండి" అంటూ ఆ ఏడ్చేపిల్లను రెక్కపట్టుకుని ఆయన నడిపించుకుని గేటుదాకా పోయేవరకు ఆమె కొంగు ముడివిప్పుతూ నేవుంది-ముడిని తిట్టుకుంటూ కాని ఆ ముడిమాత్రం విడలేదు.

"వెళ్లనే వెళ్లాడే!-" అంటూ కాస్త వదులయిందేమోనని తిరిగిగట్టిగా చివర్లు రెండూ పట్టుకుని ముడిని మళ్లీ బిగించింది.

పిల్లకు సోడా ఇప్పించి లోపలికివచ్చారో లేదో ఇంటర్వెల్లయింది. లైట్లు వెలిగాయి.

తల అటు తిప్పి చూదునుగదా-మా శేళి పిల్లవాడు మావారి ఒళ్లో కూర్చుని ఏదో గొణుగుతున్నాడు. ఏమంటాడా అని చెవి ఒగ్గివిన్నాను.

మావారు ఆతిగారి కోరిక ప్రకారం అలవాటులేని ధోవతి కట్టుకుని, అది ఊడిపోకుండా ఉండేందుకుగాను బెల్ట్ పెట్టుకున్నారని మొదట్లోనే చెప్పానుకదూ. మన ప్రభుత్వ చిహ్నముంది చూశారూ అశోకస్థంభం, సింహపుతిలలూ - ఆ బొమ్మ మావారి బెల్ మీద ఉంది. దాని ఖర్మం చాలక - కాదు, మావారికి రోజులు బాగుండక - ఆ బొమ్మ కాస్తా ఆ గుంటడి కళ్లలో పడింది. దాన్ని పట్టుకుని వదలడు. గోరుతో గిల్లుతాడు; వేళ్ళతో పట్టుకు ఊడబెరుకు


## అధైర్యపడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX—ADVICE పొందవచ్చును. మీకు ఉందుకొన్న లక్షణములు వ్రాయుచూ, యింకా వివరాలకు కవరు పంపేది.

డాక్టర్ రత్నంసన్స్, (Estd 1904)
మలకపేట బిల్డింగ్స్, హైదరాబాద్-2.
(దక్కన్)

తాడు. ఎలా వస్తుంది అది? నయాన నచ్చచెప్తున్నారు మావారు. కాని వాడు వినిపించుకుంటేగా! తను పట్టిన కుందేలుకు మూడేకాళ్ళన్న పద్ధతిలో ఉన్నాడు. పిల్లవాడాయను - అందులోనూ ఆఫీసరుగారి ఆఖరిబిడ్డ, అంతేగాక ఆఫీసరుగారి భార్యకు ముద్దులకొడుకు ఎక్కడలేని గారాబమున్నూ. అసలే కోతి; అదేమో కల్లు త్రాగిందిట, నిప్పుతొక్కిందిట - అన్నసామెతగా ఉంది పరస్థితి.

నయాన పనికాకపోతే భయపెట్టమన్నారు పెద్దలు. కాని ఈ పిల్లవాడిని - ఇంత ప్రత్యేక వ్యక్తిత్వంగల పిల్లవాడిని - కళ్ళతోనయినా భయపెట్టటానికి ఎన్ని దమ్ములుండాలి?

పిల్లవాడా బొమ్మకోసం ఏడుస్తుంటే - ఇక్కడ ఈమెగారి (మాతృ) హృదయం గిలగిలలాడుతున్నది.

“బెల్టు తీసిఈయి భాస్కరం కాసేపు. వాడు పట్టుపట్టాడంటే ఓ పట్టాన వదలడు. సినిమా వదిలినతర్వాత మాయబుచ్చి నేను నీకు ఇప్పిస్తాన్...

మావారు ఆ మాటలువిని ఆముదం తాగిన మొహం పెట్టారు. వారి బాధ నాకర్థమయింది పొద్దుటినుంచి ఆయన పరువు - మర్యాదలను నిలపెడుతున్నది ఆ బెల్టు! దానినే కనుక ఇప్పుడీపిల్లవాడి కిచ్చుటమంటే తన పరువును నడిబజారులో స్వహస్తాలతో వివస్త్ర చేయటమే!

పిలవాడు స్థాయి హెచ్చించి ఏడ్వసాగాడు ఇహ లాభంలేదనుకుని మావారు బెల్టుతీసి పిల్లవానికిచ్చారు. అక్కడితో అయింది నా పని! బెల్ నడుముకు పెట్టమంటాడు. మంత్రసాని తనానికి ఒప్పుకున్న తర్వాత తప్పేదేముంది?

పిల్లవాడి నడుమెంత ఉంటుంది! గట్టిగా బిగించేసరికి బెల్టు రెండుచుట్లు తిరిగి బొమ్మను కప్పేసింది. బొమ్మ కనపడటంలేదు - అని ఏడ్పు లంకించుకున్నాడు. ఆయన ఏంచేస్తారు పాపం! అవధులు దాటుతున్న కోపాన్ని ఆఫీసరుగారి అబ్బాయి అన్న భావం కళ్ళెంవేసి ఆపుతున్నది

బొమ్మ కనపడేలా పిల్లవాడు కోరినట్లు బెల్టు పెట్టారు వదులయి పాదాల్ని ముద్దు పెట్టుకుంది బెల్టు. పిల్లవాడు గంతువేయసాగాడు.

సహనం కోల్పోయిన మావారు “నావల్ల కాదు బాబూ! మీ అమ్మచేత పెట్టించుకో పో—” అంటూ పిల్లవాడ్ని ఆఫీసరుగారి భార్యదగరకు పంపించారు.

పిల్లవాడి తత్వమెరిగిన తల్లి కొంగు విప్పి (ఈసారి అరనిమిషంలోనే ముడి ఊడింది— అదేం విచిత్రమోగాని) ఒక చిలి కానీ వాడి చేతిలో పెట్టి బెల్టు గట్టిగా పెట్టింది.

“బొమ్మే దొంగలెత్తుకు పోకుండా— మధ్యలో దాచిపెట్టానమ్మా. ఏం?” అంది ఆమె.

వాడు సమ్మతిచూపిస్తూ తల పంకించాడు.

మావారు నిర్విణ్ణు లయిపోయారు.

ఆమె ఒళ్ళోనుంచి జారి “అక్కడ కూర్చుంటా” అంటూ మావారి దగ్గరకు చేరాడు మళ్ళీ

లైట్లు రిసయ్. సినిమా తిరిగి ప్రారంభమయింది

ఒక అయిదు నిమిషాలు గడిచాయో లేదో వారి ఒళ్ళో కూర్చున్న ఆ మూడేళ్ల పిల్లవాడు “ఉ—పోవాలి” అంటూ మొదలుపెట్టాడు.

మొదట రెండుసార్లు వినిపించుకోలేదాయన. పిల్లవాడు ఇంకొంచెం పెద్దగా అడగసాగాడు. ఈ ‘వానలేని వరద’కు విసుక్కోవాల్సింది పోయి మానవుడు ఓపికగా, “కాసేపు ఉండమ్మా. సినిమా వదులుతారు. వెళ్దాం” అని బుజ్జగించ ప్రయత్నించాడు

ఈ మాత్రానికే వినిపించుకుంటే ఇంక లేనిదేముంది? ఆయనపాలిట శత్రువులాగా తగులుకుండే ఆ గుంటడు!

“అయితే ఇక్కడే పోసుకుంటా...” అంటూ చొక్కా ఎత్తి, కూర్చోబోయాడు పిల్లవాడు.

మావారికటు ప్రక్కన కూర్చున్న కాలేజీ విద్యార్థి “ఎక్స్‌క్యూజ్ మీ! సర్! మీకు పుణ్యముంటుంది. హాలు కరాబు చేయించక అలా బయటికి తీసుకెళ్దురూ!” అని చిన్నగా ప్రార్థించాడు.

అత్తమీద కోపం దుత్తమీద చూపించినట్లు మావారు ఆ కాలేజీ విద్యార్థి మీద కోపంగా చూసి “యుస్ యువర్ ఆనర్” అంటూ కుర్చీలోంచి, లేచి పిల్లవాని చేయి పట్టుకొని ‘నడువు’ అన్నాడు.

“చీకటి...బయం. ఎత్తుకో” అన్నాడు ఆ పిల్లవాడు.

పలకరిస్తే ఎక్కడ తననే తీసికెళ్లమంటాడో అని తటపటాయిస్తున్నదో ఏమో స్థూలకాయురాలు, మావారు ఎటూ బయల్దేరారు కదా అని నిర్భయంగా “కాళ్ళుతగిలి పడతాడేమో! ఎత్తుకు తీసుకుపో అబ్బాయ్” అన్నది.

మోసేవాడికి తెలుస్తుంది బరువు! ఆ పిల్లవాడు ఆఖరువాడవటమూ, తల్లి గారాబం యెక్కువగా ఉండటం వల్లనో ఏమో పెంకితనమే గాకుండా దేహంకూడా బాగా పెంచాడు. అసలా పిలవాడ్ని చూస్తే మూడేళ్ళవాడనుకుంటారనీ-ఆరేళ్లో, ఏడేళ్లో వయస్సుంటుంది అని అభిప్రాయపడతారు. నిజం చెప్పొద్దూ.-ఆమెమీద నాకు చెడ కోపం వచ్చింది. పిల్లకు సోడా పట్టించ మందంటే కొంతకాకపోతే కొంతయినా అరముంది. మూడేళ్ళపిలవాడ్ని ఎత్తుకుని పోవాలా’ పరాయి మగవాడు

ఆమె అంటేమటుకు ఈయన ఎత్తుకో వచ్చాడా పిల్లవాడ్ని-అని నేననుకుంటూనే ఉన్నాను-అంతపిల్లవాడ్ని, అంత బరువున్న వాడ్ని, పొడుంకాయలాగా నున్నగా నల్లగా, దిట్టంగా, వున్నవాడ్ని, ఎత్తుకోనే ఎత్తుకున్నారు. ఇంత ‘జోహుకుమ్‌రాయుడు’ అయిపోయారేమా ఈయన అని నాకు ఆగ్రహం కల్గింది.

ఎత్తుకుని ఆమెనూ, నన్నూ దాటాకో లేదో ధోవతి గోచీఊడి కాళ్ళకడ్డం పడి మనిషి తూలి-రాక్ ఎన్‌రోల్ సంగీతానికి తాళంవేసూ పాటలో లీనమయిపోయి ఈ లోకం మర్చిపోయిన ఒక వర్కింగ్ గర్ల్ ఒళ్లోపోలుపడ్డారు పిల్లవాడూ, తనూ.

పిల్లవాడు భయపడి ‘గీ’ మన్నాడు-దెబ్బ ఏమీ తగలకపోయినా.

పడ్డవాడు లేవ ప్రయత్నిస్తూంటే ఆ అమ్మాయి ఒక్కతోపు తోసింది. ఆ తోపుకు సీట్లమధ్య అమ్మాయి కాళ్ళమీద పడిపోయారు. ఆ అమ్మాయి “యూ! ఫూల్!” అని కాళ్ళు గుంజుకో సాగింది.

“ఐయామ్‌సారీ!” అంటూ వారెలాగో లేచి ఏడుస్తున్న పిల్లవాడినోటికి చేయి అడ్డుపెటి ‘పదపద’ మన్నాడు

‘కళ్ళు దిగఱపెట్టుకు నడవాలి’ అన్నది అమ్మాయి మొహం కందగడ చేసుకుని. చీకట్లో ఆమెకళ్ళు జ్యోతుల్లా ఉన్నాయి.

పిల్లవాడి నోటిమీదనుంచి చేయితీస్తే, ఎక్కడ ‘గీ’ అంటాడోనని చేయి తీయకుండానే, రెండోచేత్తో ధోవతి గోచి పెట్టుకుని జాగ్రత్తగా కళ్ళు దగ్గఱపెట్టుకుని నడుస్తూ హాలు బయటికిపోయారు.

బెల్ లేకపోవటంవలన పెద్ద పరాభవమే జరిగిందే-అని నేను విచారిస్తూ కూర్చున్నాను. అయిదునిముషాలు దాదాపు గడిచినయ్. వారింకాతిరిగిరాలేదు. బయట ఆపిల్లవాడింకా ఏమేడిపిస్తున్నాడో అని నాకు భయంగా ఉంది.

“ఇంకా రాలేదు వాళ్ళు. కొంచెం బయటికిపోయి చూసిరండి. పిల్లవాడేం గోల చేస్తున్నాడో” అన్నాను నేనామెతో.

వెనుకటికెవడో నీముక్కు నదేమిటంటే, నీ చేత్తోనే ఉడువు అన్నాడుట. సరిగ్గా అలాగే అంది ఆమె.

“కాస్త నువ్వే చూసిరామ్మ రాధా! నేను పెదదానిని. లేచి పోలేను. మీ అన్నయ్యలాగా కాళ్ళుతగిలి ఎక్కడ పడతానో.”

ఆమె మాటమీద గౌరవం మాట అలా ఉంచి, నోరు లేని మా వారిని ఆ పిల్లాడు

(47-వ పేజీ చూడండి)

# ★ శ్రీవారితో సినిమాకు ★

(23 వ పేజీ తరువాయి)

ఏమేడ్పిసున్నాడోనని "సరే చూసివస్తానుండండి" అంటూ లేచాను.

ఇద్దరూ అంతలోకి దర్శనమిచ్చారు. పిల్లవాడి నోట్లో ఒక చాకలెట్టూ చేతిలో మరొకటి. దానిని బట్టి గ్రహించుకున్నా బయట ఏదో వాడు గోలచేసి ఉంటాడు అని.

హిందీ సినిమా అంటే ఎంతో శ్రద్ధాసక్తులతో చూసే దానిని అందుకు పూర్తి వ్యతిరేకంగా ఉన్నాను ఈ రోజు. కారణం సినిమాకన్న ఈ సంఘటనదే పసందుగానూ, సర్దాగానూ ఉండటమేమో!

"మీ వదిన మంచిదేనా?" ఆమె అలాగే ఫీలవుతున్నది కాబోలు లోకాభిరామాయణంలోకి దిగింది.

"పోలుద్దామన్నా మాలో అలాంటివారు మరెవ్వరూ లేరండి. ఎంత వినయం ఎంత అణకువ?! "వేషధారణ చేసిన తర్వాత పాత్రకు న్యాయం చేకూర్చటం ధర్మంగా!

"అహా! చదువుకుందా ఏమయినా?"

"ఇంటర్మీడియటు చదివింది కాని పరీక్షకు కూర్చోలేదు."

"ఆహా! కాలేజీ చదువులు చదివికూడా వినయంగానూ అణకువగానూ ఉంటుందంటే మెచ్చుకోదగ్గ విషయమే. అంతేనమ్మాయ్. కొందరు ఎంత చదువులు చదువుకున్నా సంసారపక్షంగా ఉంటారు. కొందరేమో పొట్టపొడిచినా అక్షరం ముక్క లేకపోయినా సానులాగా తయారవుతారు. మాపినమామగారి కూతురి ఆడబిడ్డ కూతురుంది. అమ్మో! దాని సొగసులూ, దాని వేషాలూ చెప్పలేమనుకో—రోజూ ఏదో సినిమా చూడాల్సిందేగదా. మరీ సినిమాలు చూస్తుందాయను, తనుకూడా అచ్చంగా ఆ సినిమా తారల్లాగానే తయారవుతుంది. దాన్నెవరు చేసుకుంటాడోగాని—వాడ్ని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెఱువులు నీళ్ళు తాగిస్తుందనుకో. రెండు జడలూ, స్లిప్పర్లూ, లిప్‌స్టిక్...అదీ..."

"నన్ను చూసి మీరేమనుకుంటున్నారు. నేనూ రెండు జడలూ వేసుకుంటాను. స్లిప్పర్లు తొడుక్కుంటాను. సంసారం చేసే దానిలాగా లేనా?"

"అంతమాట అంటావా నిన్ను" కొందరుంటారని చెప్తినిగా. రెండుకాదు నాలుగు జడలు వేసుకున్నా—అణకువగా నేఉంటారు. పెద్దలంటే భక్తి గౌరవాలుంటాయి. అన్నట్లు నువ్వేం చదువుకున్నావమ్మాయి?"

"ఆ! నా చదువుకేముందిలెండి. నానాకాలం చదువు. మా అమ్మ ఆడపిల్లలకు చదువు అంటే ససేమిరా ఒప్పుకోదు. ఏదో థర్డ్ ఫారమ్ దాకా చదువుకొన్నాను. అంతే!"

"నే చెప్పలా! అట్టే నీకు కాలేజీ చదువులేమీ లేవు కాబట్టే యీ వయినం, యీ వందనమున్నూ. నీ విషయమేమీ గొప్ప కాదు. మీ వదిన సంగతే మెచ్చుకోతగ్గది. ఆ అమ్మాయిని నేను చూడాలమ్మాయి. నాకు బలే నచ్చింది. ఎన్నో నెలన్నావు ఇప్పుడూ?"

నాకు నవ్వు వస్తున్నది.

"అలా నవ్వుతావేమమ్మాయ్! అయిందానికి కానిదానికి. ఆడపిల్లకంత వెకలితనం పనికిరాదు. కొంచెం అణిగి ఉండాలి"

ఆమెకు కోపం వచ్చిందని తెల్సుకున్నాను.

"నాకన్న మా వదిన నచ్చిందంటే నవ్వు వచ్చిందిలెండి ఎన్నో నెలనికదూ అడిగారు నాకు తెలియదండి సరిగా."

"నీది మరీ సోద్యమమ్మాయి. మీ వదినకెన్నో నెలో నీకు తెలీకుదూ. మీ అన్నయ్యకు అన్నంవండి పెట్టటానికి వచ్చిన దానివి ఎన్నాళ్లుండవలసి వస్తుంది అని ఆలోచించుకొని రాలేదూ మరి?"

"మా అన్నయ్యకన్నంవండి పెట్టటానికి వచ్చానని మీకెవరు చెప్పారు?"

"అన్నంవండి పెటటానికి కాకపోతే మరి దేనికి వచ్చినట్లు! రెండు జడలు వేసుకుని, స్లిప్పర్లు తొడుక్కుని, ఒళ్ళు కనపడే చీర కట్టుకుని, మెడంతా కనపడే జాకెట్టు తొడుక్కుని సినిమాలు చూడటానికే వచ్చింది?"

ఇందాకటినుంచి యీ అన్నా చెల్లెంద్ర నాటక మనవసరంగా ఆడుతున్నామేమోనని బాధపడుతున్నాను నేను. కాని ఇప్పుడదెంతో అవసరమని తెలుసున్నది—నేనే గనుక గుమాస్తా భాస్కరం భార్యనని ఆమె తెల్సుకుంటా రేపటినుంచి మా వారు పడే బాధ ఆ పరమాత్ముడికే తెలియాలి!

ఆఫీసరు గారింటికి తఱుమా పోయి వస్తుండాల్సిన పనులుంటాయి మా వారికి. పోయినప్పుడల్లా సూటీ పోటీ మాటలంటూ ఉంటుందీమె. "మీ ఆవిడెక్కడ? రెండు జడలూ, స్లిప్పర్లూ ... అసలు మొదటమ్మాయిని చూసినప్పుడు మీ ఆవిడనుకోలేదు భాస్కరం...ఏ సినిమా స్టారో అనుకున్నాను.. నీవు వేళ కాఫీసుకు రాగలుగుతున్నావా?—ఆ అమ్మాయి నీకు వేళకన్నం వండి పెట్టుందా—అని నా అనుమానం..." ఇలా, ఇలా.

అమ్మగారి తరహా ఇలా ఉంది; ఇక అయ్యగారి తత్త్వమెలా ఉంటుందో—మరి!

ఇదంతా మావారూ గ్రహించుకునే నాటకం బూటకం కాకుండా పాత్రను యథాశక్తిన పోషిస్తున్నారు.

"ఏమండీ! మమ్మల్నేమయినా సినిమా చూడనిచ్చేది ఉందా లేదా! అంతగా మీరు చూడదలుచుకోనకపోతే బయటకి పోయి మాటాడుతూ వచ్చానుగా" వెనక నుంచి ఒకామె మెత్తగా మందలించింది. దాంతో మా ఇద్దరి నోళ్ళకూ తాళాలు పడ్డాయి.

సినిమా అయిపోయింది. జనం వత్తిడిగా ఉంటేను పక్కకు తొలిగి నిల్చున్నాం—రద్దీ తగ్గిన తర్వాత పోవచ్చునులే అని.

జనం పల్చపడుతున్నారు. ఆ జనంలో మా పింతల్లి కొడుకు మూర్తి కన్పించాడు నాకు. వాడ్ని చూసేసరికి నాగుండె వేగంగా స్పందించ సాగింది. ఎక్కడ మమ్మల్ని చూస్తాడో అని భయం భయంగా ఉంది. చూశాడా వదలడు; కలుపుగోలుతనం పాలు వాడిలో మహాజాస్తి మమ్మల్ని చూడకుండా వాడి దారిన వాడుపోతే దేముడికి నాలుగు కొబ్బరికాయలు కొట్టానని మనసులో మొక్కుకుంటూనే ఉన్నాను—వాడు మావార్ని పలకరించాడు.

"ఒక్కడివే వచ్చావేం బావా! అక్కయ్యను తీసుకురాలా?"

కొంచెం ఇవతలగా నిల్చున్న నన్ను స్థూలకాయురాలు 'మాస్క్' చేసింది. ఆమె స్థూలకాయం ఉపయోగపడినందుకు ఆమెను అభినందించాను మనసులోనే.

"రాలేదు."

"ఏం?" వాడు ఊరుకుండే ఘటం కాదు.

బిత్తర చూపులు చూస్తూ నిల్చుండిపోయారాయన.

"మొగవాడివి సిగుపడతావేమోయ్! పురిటికని నిన్నే పుట్టింటికి పంపించాడోయ్" ఆఫీసరు తన తెలివి బయటపెట్టాడు.

"వాట్? అక్కయ్యను నిన్న ఊరికి పంపించావా? రాలేదే! ఎవరికిచ్చి పంపించావు? నేను వచ్చింది ఇంతకుముందుగానే. అయిదుగంటల బండికి... అప్పటిదాకా రాలేదే!"

ఆఫీసరు మావారి తెల్లమొహం పక్క ఎగాదిగా చూస్తారు; మావారు భావశూన్యంగా ఎటో చూస్తారు.

"మీ ఊరు కాదోయ్...మా ఊరు పంపించాను. రేపో ఎల్లుండో మీ ఊరు వస్తుంది" తెలివిగా తప్పించుకున్నారు మావారు

"అట్లా చెప్పు...సరే! వస్తాను బావా! బయట రోడ్డుమీద స్నేహితులున్నారు" అంటూ వాడు వెళ్ళిపోయాడు.

గుండెలు కుదుటపడ్డయ్. ఇక అక్కడ

# ★ శ్రీవారితో సినిమాకు ★

ఉంటే పరువు ఉండేట్లు లేదు అనుకుని "పదండి...పోదాం" అన్నాను.

అందరం కదిలి నాలుగడుగులు వేశామో లేదో—

"ఏమోయ్! ప్రభాకర్రావ్? ఎప్పుడు వచ్చావ్?" ఆఫీసరు ఎదురుపడ్డ యువకుడ్ని పలకరించాడు.

ప్రభాకరావ్! గుండెల్లో రైళ్ళు పరిగెత్త సాగినయ్.

ఎవరీ ప్రభాకర్రావు?

కొంపతీసి ఇందాకటినుంచీ వాళ్ళకు ఫిజిక్స్ లెక్చరరు ప్రభాకర్రావు కాదుగదా! మా తమ్ముడు మా పరువు నిలబెట్టా డనుకుంటే మళ్ళీ ఈయనొకడు తయారయాడే?

ఒక్క అబద్ధ మాడినందుకు- కాదు, వాళ్ళ అపోహను కాదననందుకు- ఎన్ని పరీక్షలకు గురికావలసి వస్తున్నది? చివరకి యీ నాటకం మా పరువు మర్యాదలను రచ్చకీడుస్తుందా?

"ఇవాళే పొద్దున వస్తున్నానండి. మా స్నేహితు డింటికివచ్చాను. రేపు మీ ఇంటికి రావాలను కుంటున్నాను."

అతనిపక్క ఒక యువతికూడా ఉంది. బహుశా అతనిభార్య అయిఉంటుంది.

"మీ చెల్లెలా ఆ అమ్మాయి?"

నేననుకున్నంతా అయింది! ఈ ఆఫీసరు మమ్మల్ని పరువుగా ఇంటికి పోనీయ దల్చుకోలేదు. నేను భయంభయంగా మా వారివంక చూశాను. ఆయన ఆకాశంలోని చుక్కలు లెక్కపెడ్తున్నట్లున్నారు.

ప్రభాకర్రావు సన్నగా అర్థయుక్తంగా నవ్వాడు.

ఆఫీసరుభార్య నా వంక చూసి ఒకటే ముసిముసి నవ్వులు.

"మీరు మా పెళ్ళికి రాలేదుగా-ఉత్తరం వ్రాసినా!" అన్నాడు ప్రభాకర్రావు.

పక్కనున్నామె భార్య అని అర్థం చేసుకోమన్నట్లు ఆఫీసరు పెద్దవాడు, పాతకాలపు వాడు కాబట్టి అతను ఒకరినొకరికి పరిచయం చేయటానికి సందేహించాడని నేను గ్రహించాను, అదీ ఒకందుకు మేలే!

"ఏమిటోనోయ్! ఎండలు ముదిరినయ్ - అప్పటికి" అని ఆఫీసరంటే,

"పిల్లా జెల్లా వేసుకుని ప్రయాణమయే సరికి భయపడ్డా మబ్బాయ్" అని అందుకుంది ఆఫీసరు భార్య.

"పెళ్ళికి రాకపోతేమటుకేం? ఇవ్వాళ



# మీ ఉద్యోగమేమి?


వ్యాపారియా, ఫ్రూనుసామానులు తయారు చేయు వారా...ఎలెక్ట్రీషియనా., మెకానిక్కా...హాబీయిస్టా?

అయితే మీ కత్యవసరమైనది 'ఉల్ఫుకబ్బు'—దృఢమైన, శక్తివంతమైన, ఇంతకు ముందు ఎన్నడు లభించని మీ శక్తికి తగిన ఖరీదులో దొరకు ¼ అం. ఎలెక్ట్రిక్ డ్రిల్లు.

'ఉల్ఫుకబ్బు' డ్రిల్లుతో ప్రారంభించి మీ కర్మాగారమును ఇతర విద్యుచ్ఛక్తిచే పనిచేయు పనిముట్లతో నింపుడు.

'ఉల్ఫుకబ్బు.' డ్రిల్లింగ్, పాలిషింగ్, సాయింగ్, మరియు చేతి పనిముట్లతో చేయుట వలన కలుగు అలసట, ఇబ్బందులను లేక చేయుచున్నది. అది బహు వ్యాపకమైనది, తేలికైనది మరియు ఉపయోగించుటకు సులభమైనది. మీరు తక్కువ శ్రమతో ఎక్కువ ఫలము పొంద గలరు.



Wolf Cub

రాలీస్ ఇండియా లిమిటెడ్.

320, లింగిచెట్టి స్ట్రీట్, మదరాసు. బొంబాయి • కలకత్తా • ఢిల్లీ.

మీ ఇద్దరినీ చూశాము గా!" అన్నాడు ఆఫీసరు- నన్నూ, ప్రభాకర్రావునూ మార్చి మార్చి చూస్తూ.

"ఈడూ - జోడూ అయిన సంబంధం. అమ్మాయి మాణిక్యమనుకో" అన్నది ఆఫీసరు భార్య నా తల నిమురుతూ.

నా మనసు మనసులో లేదు,

మా వారి కీ సంభాషణ కర్ణకఠోరంగా ఉందని వారి వాలకం చూస్తేనే తెలుస్తున్నది.

"ఎందుకమ్మాయ్ రాధా! అంత సిగ్గుపడతావ్? ఇక్కడ పరాయివాళ్ళెవరున్నారు?" అంటూ ఆమె నా తల పైకెత్తింది

"సరే! నీది మరీ బాగుంది. నలుగురిలో సిగ్గుపడక చిందులేయమంటావా?"

ఆఫీసరు తనకు తోచింది అన్నాడు.

"ఏమ్మాయ్! నీ పేరేమిటి?" అని ప్రశ్నించింది ఆఫీసరుభార్య-ప్రభాకర్రావు ప్రక్కనున్న యువతిని.

"మంజుల"

"ఏ ఊరిచ్చారు?" మంజుల ప్రభాకరరావు మొహంలోకి చూసింది.

ప్రభాకరరావు "మా ఇద్దర్ని గురించి ఇంత చెప్పి ఏ ఊరని అడుగుతారేమిటో?" అన్నట్లు ఆఫీసరు భార్యవంక చూశారు; రామాయణమంతా విని 'రామునికి సీతేమికావాలి' అని ప్రశ్నిస్తే ఎవరయినా ఆశ్చర్యపోరా? నవ్వరా?!

ఆమె తనేమయినా తప్పుగా అడిగానా - అని ఆలోచించసాగింది.

"ఏమిటోయ్ భాస్కరం! అలా ఆకాశం వంక చూస్తావేం? మీ బావను అదిని పల్కరించవేం?...ఆఫీసరు మావారి భుజం మీద తడ్తూ ప్రశ్నించారు

ప్రభాకరరావు చుట్టూ చూశాడు — మావారి బావమఱది కోసం.

కుడిగుండంలో చిక్కుకున్న గడ్డిపోచలాగా ఉంది నా పరిస్థితి

మూలిగే నక్కమీద తాటికాయ పడ్డట్లు మా మూర్తి కిళ్ళీ నములుతూ, సిగరెట్టు తాగుతూ మళ్ళీ లోపలికివచ్చాడు మమ్మల్ని చూసి సిగరెట్టు గబుక్కున క్రిందపారేసి ఏమీ ఎఱుగనట్లు మా దగఱకి వచ్చాడు.

"అక్కయ్యా! నువ్విక్కడే ఉన్నావే. బావ ఊరికి పంపించానంటావే — ఇందాక కన్పించి, ఈ అబద్ధాలు ఎప్పుడు నేర్చుకున్నావ్ బావా!"

బావ మొహంలో నెత్తురు చుక్క లేదు. నా పరిస్థితీ డిటో.

"అమ్మాయి రాధా! అయితే నువ్వు భాస్కరం చెల్లెలివి కాదూ. భార్యవా?" ఆఫీసరుభార్య, చూపుడువేలు ముక్కుమీద వేసుకుని, బొటనవ్రేలుతో గడ్డంక్రింద నొక్కుకుంటూ ఆశ్చర్యపడసాగింది.

ప్రభాకరరావూ, మంజులా, మూర్తీ— నాటకమధ్యలో ప్రవేశించటంతో పాత్రలర్థం కాక నిశ్చేష్టులయ్యారు.

ఆఫీసరూ, ఆయనభార్యా — నన్నూ, మావారినీ మార్చి మార్చి కళ్ళింతవి చేసుకుని ఆశ్చర్యంగా, అనుమానంగా చూడసాగారు.

ఇక యీ నాటకం సాగనీయటం సమంజసం కాదనుకుని—

"చెల్లెల్నని నేను మీకు చెప్పానా? మావారు చెప్పారా? మీరే అపోహపడారే గాని..." అన్నాను నేను ధైర్యం తెచ్చుకుని.

ప్రభాకరరావూ, మంజులా సగమర్థమయినట్లు నవ్వీనవ్వకుండా ఉన్నారు.

"నువ్వనేది నాకర్థమవటంలే దక్కయ్యా!" మూర్తి మధ్యలో అందుకున్నాడు.

"నువ్వొకడివి-మాకు దొరికావు. ఇంటికి పద"

"సెకండ్ షో చూసుకు వస్తానులే"

"రేపు మీ ఇంటికి వస్తాములెండి" అని ప్రభాకర్రావూ, మంజులా లోపలికి వెళ్ళారు. మేమందరం రోడ్డుమీదకు వచ్చాం. పిలల్లప్పటికే రిక్షాలెక్కి కూర్చున్నారు. మేమిద్దరం మరొక రిక్షా మాట్లాడుకుని వెనక్కి తిరిగి చూడకుండా ఇంటిదారి పట్టాము. ★

